క్లుప్తంగా

వైభవంగా షిరిడీసాయి బాబా వార్షికోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో షిరిడిసాయిబాబా 105వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు స్వతంత్ర భారతి మాట్లాడుతూ చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం అయోధ్య స్వామి, సాయిబాబాల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రులలో భాగంగా మహిళలకు పసుపుకుంకుమలు, నిమ్మకాయలు, తీర్థప్రసాదాలు అందించారు.

వివాహిత ఆత్మహత్య



నార్నెపాడు(ముప్పాళ్ళ): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నార్నెపాడు గ్రామంలో సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలికి ఫిరంగిపురం మండలంలోని మేరికపూడి గ్రామానికి చెందిన సలీమా(26) అనే యువతితో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత నెలన్నర క్రితం సలీమా భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్ళింది. ఆదివారం సాయంత్రం నార్నెపాడులోని భర్త వద్దకు తిరిగి వచ్చింది. సోమవారం ఉదయాన్నే భర్త మస్తాన్‌వలి పొలానికి వెళ్ళి వచ్చేసరికి ఇంట్లో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో సలీమాను దింపి పరీక్షించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న సలీమా కుటుంబసభ్యులు నార్నెపాడు రావటంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తెనపల్లికి తరలించారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సలీమా తల్లి జరీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇమామ్ తెలిపారు.

పండుగ నాడూ పీహెచ్‌సీలో ప్రసవం



కారెంపూడి: విజయదశమి సోమవారం కారెంపూడి పీహెచ్‌సీలో ఒక మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన బత్తుల దుర్గ పురిటి నొప్పులతో బాధపడుతుంటే ఆశా కార్యకర్త వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గారావు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం చేయించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, జీరో డోస్ వ్యాక్సిన్ ఇచ్చి తల్లి పాలు పట్టించడం జరిగిందని బిడ్డ 3 కిలోలున్నాడని డాక్టర్ దుర్గారావు తెలిపారు. పండుగ నాడు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉండి ప్రసవం సవ్యంగా జరిగేలా చూసిన డాక్టర్ దుర్గారావు, వైద్య సిబ్బందికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. దుర్గకు ఇది రెండవ కాన్పు.

పరిశుద్ధ క్రీస్తును ఆరాధించండి

దాచేపల్లి : ప్రతి ఒక్కరు పాపములను విడిచి మరియతల్లి కుమారుడైన పరిశుద్ధ క్రీస్తును ఆరాధించాలని గుంటూరు బిషప్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. నారాయణపురంలోని పరిశుద్ధ ఫాతిమా మాత దేవాలయం 37వ ప్రతిష్ఠ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారుడు రెవరెండ్ డాక్టర్ మద్దు బాలస్వామితో కలిసి బిషప్ భాగ్యయ్య ఆలయ సింహద్వారం, సోలార్ దీపాలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ సర్వమానవాళిని పాపము నుంచి విడిపించేందుకు ఏసుక్రీస్తు భూలోకంలో జన్మించాడని, ప్రతి ఒక్కరు క్రీస్తు గురించి తెలుసుకుని మారుమనస్సు పొంది పవిత్రంగా జీవించాలన్నారు. ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ బాలస్వామి మాట్లాడుతూ చర్చిల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ యామర్తి సురేష్, పలువురు ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

నేడు పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

రెంటచింతల: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం లిక్కర్(మద్యం) కేసులలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో కొంతకాలం కిందట అక్రమంగా లిక్కర్‌ను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన 4 ద్విచక్ర వాహనాలకు, ఒక కారుకు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలం పాటలో ఆసక్తి కలిగిన వారు పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గాపీఠంలో రాజరాజేశ్వరి దేవి



సత్తెనపల్లి వెంకటపతి కాలనీలో రాజరాజేశ్వరి దేవి



పుష్పశయని అలంకారంలో నర్సింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు



రాజరాజేశ్వరీ దేవిగా నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు



అచ్చంపేటలోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో కాళికాదేవిగా అమ్మవారు

- భక్తి శ్రద్ధలతో శమీ వృక్ష పూజలు
- శ్రీరాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు
- బతుకమ్మలను నిమజ్జనానికి తరలింపు

సత్తెనపల్లి: విజయ దశమి వేడుకలు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయాన్నే చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పవిత్ర స్నానాలు ఆచరించి తమ ఇష్ట దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం శమీ వృక్ష పూజలు చేశారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో, పట్టణంలోని అన్ని వార్డుల్లో దసరా వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, శ్రీ త్రిశక్తి దుర్గా పీఠం, శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠం, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద, మేదర సంఘ రామాలయం వద్ద, సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పార్క్ ఏరియా, వడ్డవల్లి పోలేరమ్మ గుడి, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు, సుందరయ్య కాలనీ, మహారాష్ట్ర వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, రఘురాం నగర్, నాగార్జున నగర్‌లో బతుకమ్మలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి నిమజ్జనాలకు తరలించారు. పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపును చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు ప్రారంభించారు. మహిళలు కోలాటాల ప్రదర్శనతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన్ రావు, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య, ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, నాయకులు దేవరశెట్టి రవి కుమార్, దేవతి సుబ్బారావు, కనమర్లపూడి సుబ్బారావు, కాపుగంటి సుమంత్, నోముల రమణ, కొత్తూరి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

నకరికల్లు: దసరా ఉత్సవాలలో భాగంగా విజయదశమి పర్వదినం మండలంలో వైభవంగా నిర్వహించారు. మండలంలోని ప్రముఖ ఆలయాల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పదోరోజు దసరా పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేకపూజలు చేశారు. దక్షిణకాశి ఆలయాలుగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని చేజర్ల గ్రామంలో గల శ్రీగంగా భ్రమరాంబ సమేత కపోతేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో పుష్పశయని రూపంలో , శ్రీ గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అలంకరణలలో ఉన్న స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

ఘనంగా విజయదశమి వేడుకలు

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. రాజుపాలెం అంకమ్మతల్లి దేవాలయంలో పూజారి కోటినారాయణ విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి ఫణికేశవ శర్మ చండీహోమం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మలను మహిళలు వైభవంగా నిర్వహించారు. రాత్రివేళల్లో బతుకమ్మ పాటలతో కోలాటాలు, చెక్కభజనలు మహిళలు ఉల్లాసంగా నిర్వహించారు. బతుకమ్మలను విద్యుత్ దీపాలతో, రంగురంగుల పూలతో అలంకరించి మేళతాళాలతో ఊరేగించి సాగనంపారు.

కాళికాదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత కాళికాదేవిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు సూరే సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనకార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామపారాయణం జరిగింది. స్థానిక హరిహరక్షేత్రం గంగా, భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామివారి దేవాలయంలో పార్వతీ మాత మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ప్రతి దేవాలయంలోనూ మహిళలు బతుకమ్మలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం స్థానిక కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

వైభవంగా దసరా వేడుకలు

పెదకూరపాడు: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులోని నాగమల్లేశ్వర స్వామి దేవాలయం, సీతారామస్వామి దేవాలయం, పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం, 75 త్యాళ్లూరులోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర దేవస్థానాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా రోజు అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 75 త్యాళ్లూరులో కాశీవిశ్వేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవిల తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బతుకమ్మ, కోలాటంతో అలరించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

క్రోసూరు: మండలంలో అన్ని గ్రామాల్లో దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన క్రోసూరులోని వాసవీ అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలోని స్వామివార్లను గ్రామంలో ఊరేగించారు. బతుకమ్మలను గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.



సత్తెనపల్లి వాసవి కన్యకా పరమేశ్వరి ఊరేగింపులో మహిళల కోలాట ప్రదర్శన



బతుకమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సత్తెనపల్లి సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో పూర్ణాహుతి

వైభవంగా బతుకమ్మ పూజలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని ప్రభుత్వ హాస్పిటల్ రోడ్డులో శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి మహిళామండలి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి బతుకమ్మ నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు బాలనాగు నాగమాధవి ఆధ్వర్యంలో భక్తులు దుర్గామాత అంశ అయిన బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మను పుష్పాలతో అలంకరించి కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర కృష్ణానదిలో నిమజ్జనం వైభవంగా నిర్వహించారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను దసరా వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముప్పాళ్ళలోని శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, చాగంటివారిపాలెంలో భక్తులు ఏర్పాటు చేసిన మండపంలోను, నార్నెపాడులోని శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలోను, లంకెలకూరపాడులోని శ్రీగంగాపార్వతి ఓంకారేశ్వరస్వామి ఆలయంలోను, మాదలలోని శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలోను అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చాగంటివారిపాలెంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా దీపోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



మల్లిఖార్జున స్వామివారి దేవాలయంలో మహిషాసురమర్దినిగా పార్వతీమాత



కాశీవిశ్వేశ్వర స్వామివారి తెప్పోత్సవం



పెదకూరపాడులో రాజరాజేశ్వరిగా అమ్మవారు



బుస్సాపురంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

వైఎస్సార్ సీపీ కోసం ఎంతదూరమైనా వెళతా

రాజుపాలెం: వైఎస్సార్ సీపీ పార్టీని గానీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గానీ అసభ్య పదజాలంతో దూషిస్తే వారిపై ఎదురొడ్డి పోరాడతానని, ఎంతదూరమైనా వెళతానని రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గృహసారథులకు, సచివాలయాల కన్వీనర్‌లకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశం మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ పదవుల కోసం పార్టీలు మార్చే సైకో కన్నా లక్ష్మీనారాయణ బాబుతో కలసి ఈ సైకో బ్యాచ్ ఎంత మంది వచ్చిన రానున్న ఎన్నికల్లో మట్టికరిపిస్తానని అన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో చిత్తశుద్ధితో విజయవంతం అయ్యేల నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ప్రారంభం కానున్న సామాజిక న్యాయ బస్సు యాత్ర, నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వై ఏపీ నీడ్స్ జగన కార్యక్రమాల నిర్వహణ విధి విధానాలను తెలియజేశారు. పార్టీ అధ్యక్షులు, అధికారులతో కలసి సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరణ, పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నేతలతో సమావేశాలు, మరుసటి రోజు పార్టీ జెండా ఆవిష్కరణ, ఇంటింటికి సంక్షేమ చైతన్య ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు తదితరులు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. జగన్ ముఖ్యమంత్రి కాకపోతే ఈ సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయని, అందరు కలిసికట్టుగా పనిచేసి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునే అవసరం ఎంతైనా ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి తదితరులు

ఏరియా వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు వినతిపత్రం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు రక్తం ఎక్కువగా అవసరం అవుతుందని, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా ఉచితంగానే పేద ప్రజలకు రక్తం అందించవచ్చన్నారు. ఆ దిశగా కమిషనర్‌కి హాస్పటల్ అభివృద్ధి కమిటీ తరపున వినతిపత్రం అందజేయనున్నామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో బ్లడ్ స్టోరేజ్ పాయింట్ ఉందని, అయినప్పటికీ బ్లడ్ బ్యాంకు రావడంతో ఎక్కువ మందికి సేవ చేసే అవకాశం ఉంటుందని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని కమిషనర్‌కి పంపించి అతి త్వరలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమావేశంలో ఆర్ఎంఓ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, డాక్టర్ కృష్ణమూర్తి, గైనకాలజిస్ట్ సుజాత తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్త రామకృష్ణ

గుడ్‌షెపర్డ్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ సందర్శించిన బాలలు

క్రోసూరు: అమరావతి గుడ్‌షెపర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాలలు (పార్లమెంట్) పోలీసుస్టేషన్‌ను సందర్శించటం జరిగింది. సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు స్టేషన్ ఏఎస్ఐ యోహాను, హెడ్‌కానిస్టేబుల్ దుర్గారావు, రైటర్ దాసు బాలలతో మాట్లాడారు. పోలీసుస్టేషన్‌లో కేసులు ఏవిధంగా నమోదు చేస్తారు, ఎఫ్ఐఆర్, రికార్డులు ఏవిధంగా నమోదు చేస్తారు, పోక్సో చట్టం, దిశ యాప్ గురించి, బాలల ప్రొటెక్షన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా సుపీరియర్ మాట్లాడుతూ బాలలు దేశ సంపద అని బాలల రక్షణ మన అందరి బాధ్యత అని, బాలల రక్షణ పట్ల పోలీసు యంత్రాంగంలో ప్రాముఖ్యత గురించి తెలియపరిచారు. బాలల రక్షణ కొరకు ప్రభుత్వం కల్పించిన డయల్ 100, చైల్డ్ లైన్ 1098, గ్రామాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల బాధ్యతల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, గుడ్‌షెపర్డ్ సంస్థ సిబ్బంది సిస్టర్ మార్టినా, చిల్కా బాబూరావు, పవన్, బాబూ, కవిత తదితరులు పాల్గొన్నారు.



క్రోసూరు పోలీసుస్టేషన్ సందర్శించిన బాలలు, గుడ్‌షెపర్డ్ సంస్థ ప్రతినిధులు

అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఆయన మాట్లాడారు. ప్రతి ఎరువుకు, పురుగు మందులకు కచ్చితంగా పీసీలు కలిగి ఉండాలన్నారు. పీసీలు లేకుండా అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. ఎప్పటికప్పుడు క్రయ విక్రయాలకు సంబంధించిన సమాచారం రికార్డులలో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేసి ఇవ్వాలన్నారు. షాపులో స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనుమతి లేని మందులను, ఎరువులను విక్రయించిన వారిపై తీవ్రమైన చర్యలు తప్పవన్నారు.



భవానీల దీక్ష విరమణ

నాదెండ్ల: గణపవరం ఆదిపరాశక్తి ఆలయంలో సోమవారం రాత్రి అమ్మవారికి పడి పూజ నిర్వహించారు. ఆదిపరాశక్తి క్షేత్రం పీఠాధిపతి నిత్య విద్యానంద భారతి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి లక్షపత్రి పూజ, పడిపూజ నిర్వహించారు. అనంతరం భవానీలు దీక్షను విరమించారు.విజయదశమి రోజున ఆనవాయితీగా అమ్మవారికి మొక్కుల రూపంలో గాజుల సమర్పణ చేశారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నాటుసారా అమ్ముతున్న మహిళను వినుకొండ ఎస్ఈబీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వినుకొండ మండలంలోని పార్వతీపురం గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద త్రిపురాంతకం మండలం డీవీఎస్ కాలనీకి చెందిన పోలిశెట్టి నాగమణి అనే మహిళ నాటుసారా విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకొని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నాగమణిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి వినుకొండ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించడం జరిగింది. ఈ దాడిలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయభాస్కరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

కపోతేశ్వరస్వామి వారికి సర్వాంగం, నాగాభరణం బహూకరణ

నకరికల్లు: శిబిచక్రవర్తి కాలం నాటి చరిత్ర కలిగి, దక్షిణకాశీగా భక్తులచే నీరాజనాలందుకుంటున్న చేజర్లలోని శ్రీకపోతేశ్వరస్వామివారికి విజయవాడకు చెందిన పసుపులేటి కిరణ్‌కుమార్ దంపతులు వెండి వస్తువులను మంగళవారం బహూకరించారు. ఆరున్నరకిలోల వెండితో తయారుచేసిన స్వామివారి సర్వాంగం, నాగాభరణాలను ఆలయ ప్రధాన అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్య శర్మకు అందజేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు పసుపులేటి యామిని, ఖ్యాతేష్, కార్తీక పాల్గొన్నారు.



వెండి సర్వాంగం, నాగాభరణంతో పసుపులేటి కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు